క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల తనిఖీ

లింగసముద్రం: స్థానిక కేఆర్ జెడ్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదపవనిలో భోరావ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన సైన్స్ 2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. లింగసముద్రం కేఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని స్క్వాడ్ అధికారి పీవీ రమణ తనిఖీ చేశారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చూడాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. పెదపవనిలో సిట్టింగ్ స్క్వాడ్‌గా ఎంఈఓ 2 శివకుమార్ వ్యవహరించారు.

692 పొగాకు బేళ్ల విక్రయం


కొండపిలో వేలంలో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు

కొండపి(మద్దిపూడి): కొండపి పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం మద్దిపూడి మండలం తంగెళ్ల, నరసరాజుపాలెం, అయ్యప్పరాజుపాలెం గ్రామాల రైతులు 820 బేళ్లు తీసుకురాగా 692 బేళ్లు కొనుగోలయ్యాయి. వివిధ కారణాలతో 124 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. అత్యధిక ధర కేజీ రూ.231, అత్యల్ప ధర రూ.220, సరాసరి ధర రూ.229 పలికిందని వివరించారు.

పొగాకు కనిష్ట ధర రూ.220


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం జమ్ములపాలెం, తూమాడు గ్రామాల రైతులు 879 బేళ్లను వేలానికి తీసుకురాగా 774 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.231, సరాసరి ధర రూ.228.28 పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం


విద్యార్థులకు మానవహక్కులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గౌస్

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థులు మానవ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర మానవహక్కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ షేక్.గౌస్ అన్నారు. మండలంలోని చెన్నపునాయునిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం మానవహక్కులు, చట్టాలపై పాఠశాల హెచ్‌ఎం షేక్.చాంద్‌బాషా అధ్యక్షతన అవగాహన కల్పించారు. డాక్టర్ గౌస్ మాట్లాడుతూ మానవుని జీవితంలో హక్కులు చాలా విలువైనవని, ప్రతి ఒక్కరూ తమ హక్కులను వినియోగించుకుంటూ ఇతరుల హక్కులకు భంగం కలగకుండా జాగ్రత్త వహించాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి చట్టాలను గౌరవించాలని, వీటిపై విద్యార్థి దశ నుంచే తెలుసుకుని ఉండాలన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ మృతి

పీసీపల్లి: పీసీపల్లి మాజీ ఎంపీపీ పులి సుబ్బమ్మ(85) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం పొందుతుండగా.. మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందింది. ఆమె మృతికి వైఎస్సార్ సీపీ అభ్యర్థి దద్దాల నారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొర్రారెడ్డి, ఎంపీపీ అత్యాల జపన్య, జెడ్పీటీసీ ఓకేరెడ్డి తదితరులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎన్నిక కోడ్ కట్టుదిట్టం


టంగుటూరులో మాట్లాడుతున్న ఆర్వో అరవ కుమార్

టంగుటూరు: సార్వత్రిక ఎన్నికల నియమావళిని కట్టుదిట్టం చేయాలని సిబ్బందిని ఆర్వో అరవ కుమార్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్వో, మహిళా పోలీసులకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలు ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజకీయ నాయకులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుటుంబరావు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతను మళ్లీ గెలిపించుకుందాం

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్


టంగుటూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

టంగుటూరు: పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందిస్తున్న సీఎం జగనన్న సంక్షేమ ప్రదాత అని, ఆయన్ను మళ్లీ గెలిపించుకుందామని మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశమై రానున్న సార్వత్రిక ఎన్నికలపై మంగళవారం చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ నాయకులు ఓటరు జాబితాలపై దృష్టి సారించి ప్రతి ఓటు ఒడిసి పట్టాలన్నారు. జగనన్న ప్రతి ఇంటికీ చేసిన మేలుని, టీడీపీ హయాంలో పేద ప్రజలకు జరిగిన అన్యాయాన్ని వివరించాలని సూచించారు. రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం కావాలంటే రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం, పేద ప్రజల ప్రగతి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం మనదేనన్నారు. ఎమ్మెల్యే స్వామి లాగా నా మీద మరుగుదొడ్ల కుంభకోణం, నీరు–చెట్టు నిధుల దోపిడీ వంటి అవినీతి ఆరోపణలు లేవన్నారు. సంతనూతలపాడు, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో ఒక్క మచ్చ లేకుండా ప్రజలకు సేవ చేశానని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై అమూల్యమైన ఓటును ప్రజలతో వేయించి అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఆదరించి చూడండి అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, పార్టీ బీసీ సెల్ కార్యదర్శి తన్నీరు వీరనారాయణ, ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాసు, పార్టీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి సనగరకోటి వల్లంరెడ్డి రమణారెడ్డి, దేవరపల్లి వరుణ్, తేళ్ళ డేవిడ్, గొల్లపూడి సునీత, దుగ్గిరాల పేర్రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ కాంతులు


విజయవాడలో కనిగిరి వాసులతో దద్దాల నారాయణ యాదవ్


దొడ్డిచింతలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కనిగిరి రూరల్: సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ అభ్యర్థి దద్దాల నారాయణ సతీమణి దద్దాల మంజు భార్గవి అన్నారు. పట్టణంలోని 13,12 వార్డుల్లో మంగళవారం ఇంటింటికి వైఎస్సార్ సీపీ ప్రచారం కౌన్సిలర్లు సయ్యద్ రిజ్వానా ఖాలక్, శ్రీరాం సతీష్, ఏఎంసీ చైర్మన్ సీహెచ్ సాల్మన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల మంజు భార్గవి మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో ప్రతి ఇంట్లో రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు లబ్ధి జరిగిందన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం దక్కిందన్నారు. అమ్మఒడి, ఆసరా, చేయూత. వడ్డీ రాయితీ, విద్యా దీవెన వంటి సంక్షేమ పథకాలు కొనసాగాలంటే త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి వేయించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలన్నారు. రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాల్మన్ రాజు, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ప్రజా సంక్షేమ పాలన సాగిందన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను ప్రతి గడపలో అందచేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. సంక్షేమ లబ్ధిదారులంతా ఫ్యానుగుర్తుకు ఓటేసి దద్దాల నారాయణ యాదవ్‌ను ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించి వైస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ మోహన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని సుజాత, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, సిరుప గోవర్ధన్‌రెడ్డి, చింతగుంట్ల కిషోర్, డాక్టర్ రసూల్, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు దాసరి మురళీ, దేవకి రాజీవ్, పండ్ల ఖాదర్, పులి శ్రీను, పి. అరుణోధర్, రహిమాన్, నాగూర్‌వలి, ఖాజా, మీరావలి, షకీలా, భారతి, నాగమణి, ఏఎంసీ డైరెక్టర్లు బొట్టు శ్రీను, ద్రోణాదుల చెంచులు, చెరుకూరి చిన కాశయ్య, చాంద్, మీసాల కొండయ్య, నూర్, నాగరాజు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.


గ్రామాల్లో ప్రచారంలో జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి


ఇంటింటి ప్రచారంలో దద్దాల మంజు భార్గవి, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు

హనుమంతునిపాడు: ఐదేళ్లలో అవినీతిరహితంగా, పారదర్శకంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి అన్నారు. మండలంలోని దొడ్డిచింతల, సీతారాంపురం గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ పథకాలన్నింటినీ ప్రభుత్వం ప్రజల ఇంటికే చేర్చిందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ, అభివృద్ధి గురించి వివరించాలన్నారు. నవరత్నాల పథకాల ద్వారా పేదలకు ఆర్థిక బరోసా కల్పించిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా దద్దాలనారాయణకు, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్టారెడ్డి, ఆస్ట్రేలియా కన్వీనర్ చింతల చెరువు సూర్యనారాయణరెడ్డి, గాయంవారిపల్లి సర్పంచ్ గాయం రామక్రిష్ణారెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు ఎస్ మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంఘ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, గృహ సారథుల కన్వీనర్ మద్ది తిరుపతయ్య, కోటపాటి మోహన్‌రెడ్డి, టి.తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ డి.పిచ్చిరెడ్డి, జీవన్, కె.ఉపసర్పంచ్ ఏరువ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా మనమందరం కలిసి పనిచేద్దాం అని వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో నివసిస్తున్న కనిగిరి ప్రాంత వాసులను దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం దక్కిందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రతి ఒక్కరిని అభ్యర్థించారు.

కనిగిరి రూరల్: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. మండలంలోని వంగపాడు, ఎగువపల్లి పంచాయతీల్లో ఇంటింటి వైఎస్సార్ సీపీ ప్రచారం నిర్వహించారు. అనంతరం జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి మాట్లాడుతూ ఎటువంటి అవినీతికి తావు లేకుండా, అర్హతే ప్రమాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందచేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే నన్నారు. ఎంపీపీ ప్రకాశం, సర్పంచ్ రావులపల్లి తిరుపతినాయుడు, ఎంపీటీసీ హజరతమ్మ, పొలక సిద్ధారెడ్డి, శ్రీహరిరెడ్డి, నరాల వెంకటరెడ్డి, పేతురు, మహేంద్రారెడ్డి, ఎస్‌కే మస్తాన్, గురుస్వామి, పోలక మాలకొండయ్య, రవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది గైర్హాజరుపై విచారణ


సచివాలయంలో విచారణ చేస్తున్న ఎంపీడీఓ

పామూరు: మండల కేంద్రమైన పామూరు 2,3,4 సచివాలయాల్లో ఉదయం 11.30 గంటల సమయంలో సచివాలయ సిబ్బంది ఎవ్వరూ లేరని మండలంలోని నుచ్చుపొద ఉపసర్పంచ్ గోళ్ల వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీఓ పల్లెల పుట్టారెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పుట్టారెడ్డి, పీఎస్ వి.బ్రహ్మానందరెడ్డి సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై విచారణ చేపట్టారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, ఎవ్వరైనా విధుల్లో భాగంగా ఫీల్డ్‌కు వెళ్లినప్పుడు విధిగా మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలు, సమయం నమోదు చేసి వెళ్లాలని సూచించారు. విధులకు దుమ్మా కొట్టే వారిపై చర్యలకు సిఫార్సు చేస్తానన్నారు.

ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు రూరల్: మండలంలోని జి.మేకపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యు.దాసు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నట్లు చెప్పారు. కోర్సుల్లో చేరాలనుకునే వారు ఈ నెల 28 నుంచి మే 22వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8106433746 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి


సోమరాజుపల్లిలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న కేంద్ర సాయుధ బలగాలు


మాట్లాడుతున్న కనిగిరి డీఎస్పీ రామరాజు


వలేటివారిపాలెంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది

సింగరాయకొండ(మద్దిపూడి): రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ దాచేపల్లి రంగనాథ్ కోరారు. సింగరాయకొండ మండలంలోని సింగరాయకొండ, మూలగుంటపాడు, సోమరాజుపల్లి, పాతసింగరాయకొండ, కలికవాయ గ్రామాల్లో మంగళవారం బీఎస్ఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ భారీ బందోబస్తు ఏర్పాటు చేసిందన్నారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎస్సై టి.శ్రీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర సాయుధ బలగాలతో కవాతు

వెలిగండ్ల: ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి డీఎస్పీ రామరాజు హెచ్చరించారు. కనిగిరి డీఎస్పీ రామరాజు, కనిగిరి సీఐ బి.వెంకటేశ్వర్లు, పామూరు సీఐ రామ్ నాయక్ ఆధ్వర్యంలో వెలిగండ్ల పురవీధుల్లో కేంద్ర సాయుధ బలగాలతో మంగళవారం కవాతు నిర్వహించారు. ఎన్నికల నియమావళి గురించి ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామరాజు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున కేసుల నమోదైతే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా మతతత్వాలకు సంబంధించి పోస్టులు పెడితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై శివ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని గుడ్లూరు సీఐ బీవీఎల్ సుబ్బారావు తెలిపారు. ఎస్సై బాలనాయక్ అధ్వర్యంలో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు మంగళవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నికల వేళ ఎక్కడైన అలజడులు సృష్టించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి పౌరుడు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. లింగసముద్రం ఎస్సై బాజీబాబు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బుర్రాకు వికలాంగుల మద్దతు


వికలాంగులతో బుర్రా మధుసూదన్ యాదవ్


బుర్రాను కలిసిన మోచర్ల నాయకులు

కందుకూరు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు పెరుగుతోంది. ఇప్పటికే వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, నాయకులు బుర్రాను కలిసి తమ మద్దతు తెలియజేశారు. ఈ క్రమంలో మంగళవారం వికలాంగుల విభాగం ఆధ్వర్యంలో పలువురు వికలాంగులు బుర్రాను కలిసి మద్దతు తెలిపారు. తమకు ప్రతినెలా పింఛన్ ఇంటి వద్దే తెచ్చి ఆర్థికంగా అండగా ఉంటున్నారని, జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు తామంతా పార్టీ ప్రచారంలో పాల్గొంటామని తెలిపారు. ఈ సందర్భంగా బుర్రా మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేశారని, అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికంగా భరోసా కల్పించారని వివరించారు. వైఎస్సార్‌సీపీ వికలాంగ విభాగం నాయకులు కొండ్రాజు రమణయ్య, మురళీ కృష్ణ, ఏసోబు, అనంత తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా గుడ్లూరు మండలం మోచర్లకు చెందిన నాయకులు బుర్రాను కలిసి మద్దతు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ప్రమాద బాధితులకు పరామర్శ


ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న బుర్రా

కందుకూరు: మండలంలోని చినమోపాడు వద్ద ఆటో, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో గాయపడి స్థానిక ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ పరామర్శించారు. ఆస్పత్రికి వెళ్లి ప్రమాదం జరగడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రమాదంలో గాయపడ్డ బూసి లక్ష్మమ్మ, ఉమామహేశ్వరిలను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన డాలు లక్ష్మమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. లక్ష్మమ్మ భర్త ప్రస్తుతం డయాలసిస్ పేషెంట్‌గా ఉన్నారని, కుటుంబ తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సమయంలో రోడ్డు ప్రమాదంలో లక్ష్మమ్మ మృతి చెందడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరంగా రావాల్సిన అన్ని విధాల సహాయం అందేలా చూస్తానని బుర్రా వారికి హామీ ఇచ్చారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం


తూమాడులో మందులు పంపిణీ చేస్తున్న అధికారులు


అరివేములలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రవీణ

జరుగుమల్లి: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని జరుగుమల్లి పీహెచ్‌సీ డాక్టర్ కావ్యశ్రీ పేర్కొన్నారు. మంగళవారం తూమాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం నిర్వహించారు. 298 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీడీఓ కె.జలజాక్షి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ కావ్య, డాక్టర్ కుమార్‌వర్మ, సీహెచ్ఓ పి.వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల ద్వారా కార్పొరేట్ వైద్యసేవలు పేదలకు అందుబాటులోకి వచ్చాయని డాక్టర్ మహేష్, డాక్టర్ హోమద్యుతి అన్నారు. మండలంలోని అరివేముల సచివాలయంలో మంగళవారం ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సంర్భంగా డాక్టర్ మహేష్, డాక్టర్ హోమద్యుతి, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ ప్రవీణలు 339 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి రోగులకు పంపిణీ చేశారు. పీఎస్ గోళ్ల చంద్రశేఖర్, సీహెచ్ఓ అవుల మురళి, ఎంఎల్‌హెచ్‌పీ ఎం దేవమాధురి, జపాపుష్ప, వైద్యసిబ్బంది, పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన


చోడవరంలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న విక్టోరియా రాణి

కొండపి(మద్దిపూడి): ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని సమర్థులైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కొండపి నోడల్ అధికారి విక్టోరియారాణి సూచించారు. కొండపి మండలం చోడవరంలో మంగళవారం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నోడల్ అధికారి మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఈసారి ఎన్నికల్లో 81 ఏళ్లు దాటిన వృద్ధులకు బ్యాలెట్ ఓటు వేసే అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. బ్యాలెట్ ఓటు వినియోగంపై వృద్ధులకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని పచ్చాకు కూలీలకు సూచించారు. ర్యాలీలో ఎన్నికల సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుని పల్లకి సేవ


స్వామివారిని పల్లకిపై ఊరేగిస్తున్న భక్తులు

మద్దిపూడి: పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం మారుతీచార్యులు స్వామివారి ఉత్సవమూర్తులను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతిమలను పల్లకిపై ఉంచి మాఢ వీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఉభయదాతలుగా అలవల వెంకట సుబ్బయ్య, అలవల రాధయ్య, అలవల చెంచు లక్ష్మీనారాయణ, అలవల చెంచుసుబ్బారావు కుమారులు వ్యవహరించారు.